
## ఉద్యమంలో చల్మారెడ్డి కృషి మరువలేనిది

- తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం
- మలిదశ తెలంగాణ ఉద్యమ నాయకుడు చల్మారెడ్డి వర్ధంతి సభ



చల్మారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేఏసీ చైర్మన్ కోదండరాం తదితరులు

ఇబ్రహీంపట్నం, జూలై 28 : మలిదశ తెలంగాణ ఉద్యమంలో స్వర్గీయ చల్మారెడ్డి పాత్ర మరువలేనిదని తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలోని భారత్ కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ ఉద్యమ నాయకుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చల్మారెడ్డి మొదటి వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి ఉద్యమంలో తనదైన ముద్ర వేసుకున్న చల్మారెడ్డి సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నాటి ఉద్యమకారులందరం పనిచేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, న్యూ డెమోక్రసీ నాయకుడు గోవర్ధన్, సీపీఐ నాయకుడు నర్సింహ, ఉద్యమకారులు విక్టర్, అశోక్, లక్ష్మారెడ్డి, శివకుమార్, జగదీశ్వర్‌యాదవ్, వేణుగోపాల్‌రావు, జంగయ్య, రవీందర్, అంజయ్య, ముజీబ్, రమేశ్, నిరంజన్, గౌస్ ఉన్నారు.



షాద్‌నగర్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ నాయకులు

## కేసులు పెడుతామని బెదిరిస్తుండ్రు..

- అధికారంలోకి వచ్చి 7 నెలలు అయినా ఇంకా అభివృద్ధి చేయలే..
- బీఆర్ఎస్ పాలనలోనే తండాల అభివృద్ధి
- కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకులు

షాద్‌నగర్, జూలై 28 : ఇచ్చిన హామీలు ఏమయ్యాయి ? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడిగితే కేసులు పెడుతామని ఆ పార్టీ నాయకులు బెదిరింపులకు దిగుతున్నారని బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆదివారం షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్టీ సెల్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, మోహన్‌నాయక్, సుధాకర్‌నాయక్ మాట్లాడారు. చేవెళ్ల కాంగ్రెస్ సభలో గిరిజనుల డిక్లరేషన్‌పై ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాంబల్‌నాయక్ ప్రశ్నిస్తే.. ఆ పార్టీ నాయకులు అర్థం లేనివిధంగా ఆరోపణలు చేస్తూ తమ వ్యక్తిగత ఉనికిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, పిచ్చి కూతలు కూస్తున్నారని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా తండాల్లో కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయలేదని, తండాల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని వాపోయారు. బీఆర్ఎస్ పాలనలో మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో తండాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించడంతోపాటు మంచి నీళ్లు, బీటీ రోడ్లు, పంచాయతీ భవనాలు వంటి ఎన్నో మౌలిక వసతులను కల్పించారని చెప్పారు. 60 ఏండ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గిరిజన తండాల్లో కనీసం మంచి నీళ్ల వసతి కల్పించలేదని, ఏండ్ల తరబడి కరెంటుకు దూరంగా ఉన్నామని విమర్శించారు. అభివృద్ధిని విస్మరించి ఏదో తాము గొప్పగా చేస్తున్నామని కలరింగ్ ఇస్తే ప్రజలు నమ్మబోరన్నారు. కేసీఆర్ క్యాబినెట్‌లో గిరిజన మహిళలకు మంత్రి పదవి ఇస్తే, సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో గిరిజనులకు మంత్రి పదవి ఇచ్చారా ? అని ప్రశ్నించారు. మూడు ఐటీడీఏలు ఎక్కడ ఉన్నాయని, గిరిజనుల సంక్షేమం, కార్పొరేషన్ల ఏర్పాటు జరిగిందా ? అని ప్రశ్నించారు. తాజా బడ్జెట్‌లో గిరిజన సంక్షేమం ఎక్కడ ఉందో చెప్పాలని, కేవలం అంకెలను చూపిస్తూ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తే ప్రజలే తగిన బుద్ధి చెపుతారన్నారు. అభివృద్ధిలో పోటీపడాలే తప్పా, విమర్శలు చేయడంలో కాదని, గిరిజన అభివృద్ధిపై ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు మాట్లాడితే.. స్థాయిని మర్చి వారిపై అర్థం లేని ఆరోపణలు చేయడం కాంగ్రెస్ నేతలకే చెల్లిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన శ్రీనూనాయక్‌కు తండాల మౌలిక వసతులపై కనీస అవగాహన లేదని, లంబాడా గిరిజనులు ప్రభుత్వాల నుంచి ఏం ఆశిస్తున్నారో తెలుసుకోకుండా తమ ప్రచారం కోసం గొప్పలకు పోతున్నారన్నారు. ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకొని లంబాడాల సంక్షేమంపై దృష్టిసారించాలని వారు సూచించారు. సమావేశంలో ఎస్టీ సెల్ నాయకులు రాజూనాయక్, రఘునాయక్, రామునాయక్, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తాం




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు కరణం అరవిందరావు

పరిగి, జూలై 28 : బ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని జిల్లా బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు కరణం అరవిందరావు పేర్కొన్నారు. ఆదివారం పరిగిలోని టీటీడీ కల్యాణ మండపంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన జిల్లా నూతన కార్యవర్గ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. బ్రాహ్మణులు ఆర్థికంగా అభివృద్ధిలోకి రావాలన్నారు. ప్రతి కుటుంబం అభివృద్ధి కోసం అవసరమైన మేరకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తామన్నారు. బ్రాహ్మణుల అభివృద్ధికి కావాల్సిన కార్యక్రమాలకు రూపకల్పన చేస్తామన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దత్తాత్రేయరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ పెద్దలు సిద్ధాంతి పార్థసారథి, ప్రహ్లాదరావు, పురుషోత్తంరావు, పరిగి తాలూకా అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, వివేకానంద, వాసు ఉన్నారు.

## ల్యాండ్ పూలింగ్ వేగవంతం

- పెండింగ్‌లో ఉన్న భూసేకరణ వేగవంతమయ్యేలా చర్యలు
- భారీ లే అవుట్లతో రెవెన్యూపై దృష్టి పెట్టిన సర్కార్

సిటీబ్యూరో, జూలై 28(నమస్తే తెలంగాణ): పెండింగ్‌లో ఉన్న ల్యాండ్ పూలింగ్‌ను వేగవంతం చేసేలా కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర సర్కారు హెచ్‌ఎండీఏకు సూచించింది. భూ సేకరణ ప్రక్రియల్లో ఉన్న పురోగతి, భూముల లభ్యత అంశాలపై ప్రత్యేక నివేదికను హెచ్‌ఎండీఏ తయారు చేయనుంది. రైతుల నుంచి భూములను సేకరించి డెవలప్ చేయడం ద్వారా తన వాటాగా వచ్చిన భూములను విక్రయించేలా హెచ్‌ఎండీఏ ప్రణాళికలను అమలు చేయనుంది. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిధిలో ల్యాండ్ పూలింగ్ వేగవంతం చేయడం వలన మార్కెట్‌పై ప్రభావం చూపేలా కార్యాచరణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇటీవల తెలంగాణ వ్యాప్తంగా పెరుగుతున్న భూముల ధరలకు అనుగుణంగా తమ వాటా శాతాన్ని పెంచాలనే డిమాండ్లు రైతుల నుంచి పెరుగుతున్నాయి. నగరం చుట్టూ ఉండే ప్రతాపసింగారం, కొర్రెముల, భోగారం, లేమూరు, దండు మల్కాపూర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే 900 ఎకరాలకు పైగా భూమి డెవలప్‌మెంట్ కోసం ఇప్పటికే గుర్తించారు. తాజాగా, హైదరాబాద్ చుట్టూ దాదాపు 11వేల ఎకరాలకు పైగా భూమిని సమీకరించాలనే ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. కేవలం ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా భారీ లే అవుట్లను అవుటర్ రింగు రోడ్డు చుట్టూ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం కార్యాచరణను అమలు చేస్తోంది.



మొయినాబాద్ : సురంగల్ గ్రామంలో..



షాద్‌నగర్‌టౌన్ : పట్టణంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ తదితరులు



షాద్‌నగర్‌టౌన్ : బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే శంకర్



బషీరాబాద్ : పోచమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నాయకులు



షాబాద్: సర్దార్‌నగర్‌లో బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

## బోనం.. అంగరంగ వైభవం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా బోనాల ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. భాజాభజంత్రీల మధ్య మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించారు. అమ్మవార్ల ఆలయాల చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువత కేరింతలతో గ్రామాలు, పట్టణాలు మార్మోగాయి. దీంతో ఆధ్యాత్మిక, పండుగ వాతావరణం నెలకొన్నది. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శంకర్, మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, జడ్పీ మాజీ చైర్మన్ సునీతారెడ్డి, ఇతర ప్రముఖులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్



షాబాద్ : గొల్లూరుగూడలో బోనమెత్తుకున్న వికారాబాద్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు, పర్యాటకులు వికారాబాద్ సమీపంలోని అనంతగిరి పద్మనాభస్వామిని దర్శించుకున్నారు. అనంతరం అనంతగిరి సమీపంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. అనంతగిరి అటవీ అందాలను చూస్తూ మైమరచిపోయారు. సెల్ఫీలు దిగారు. ఆటపాటలతో గడిపారు. వన భోజనాలు చేశారు. - వికారాబాద్ జిల్లా నెట్‌వర్క్



## శాకాంబరిదేవిగా అమ్మవారు

ఆర్కేపురం, జూలై 28 : ఆర్కేపురం డివిజన్‌లోని కుర్తాళ పీఠం వారాహి సమేత ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం అమ్మవార్లకు శాకాంబరి అలంకరణ సేవ నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలతో ఆలయాన్ని అలంకరించారు. మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ హాజరై అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రటరీ శ్రీనివాస్ అరవింద్‌శర్మను సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.

## 7న వెబినార్

సిటీబ్యూరో, జూలై 28 (నమస్తే తెలంగాణ) : ఇండియన్ కౌన్సిల్ మెడిసినల్ రీసెర్చ్ ఆధ్వర్యంలో ఆగస్టు 7న జాతీయ స్థాయి వెబినార్ జరుగనున్నది. ఇంప్లిమెంటేషన్ రీసెర్చ్ అంశంపై జరిగే ఈ సదస్సులో ఐసీఎంఆర్‌కు చెందిన ల్యాబొరేటరీ సంస్థలు, వైద్యారోగ్య శాఖలు, ఇతర పరిశోధన సంస్థలకు చెందిన సైంటిస్టులు, నిపుణులు హాజరుకానున్నారు. జీవక్రియలు, అనారోగ్య సమస్యల నియంత్రణలో అందుబాటులోకి వస్తున్న పరిశోధనలపై చర్చించనున్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన 15 మందికిపైగా నిపుణులు ఈ వెబినార్‌లో పాల్గొంటారని ఐసీఎంఆర్ వర్గాలు వెల్లడించాయి.

## వర్షాకాలంలోనూ నాలా పూడికతీత

### 952.69 కి.మీలో 781.42 కి.మీలలో మట్టి తొలగింపు

సిటీబ్యూరో, జూలై 28 (నమస్తే తెలంగాణ ) : నాలా పూడికతీత పనులు మే నెలాఖరు నాటికే పూర్తి కావాల్సి ఉంది. వర్షాకాలం వచ్చి.. జూలై ముగుస్తున్నా.. నేటికీ పనులు కొనసాగుతుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రేటర్‌లో నాలా పూడికతీత నిరంతర ప్రక్రియ అని జీహెచ్‌ఎంసీ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలాల్లో ఫ్లోటింగ్ మెటీరియల్‌తో నిలిచిన నీరు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా నియంత్రణకు పూడికతీత పనులను ఏటా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వర్షాకాలంలో ఇబ్బందులను తొలగించేందుకు ప్రీ మాన్సూన్, మాన్సూన్ సందర్భంగా, పోస్ట్ మాన్సూన్‌లో చేపట్టిన చర్యల్లో భాగంగా డీ సిల్టింగ్ ప్రక్రియతోపాటు వర్షంతో దెబ్బతిన్నవి, పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నామన్నారు. జీహెచ్‌ఎంసీవ్యాప్తంగా వరద కాలువ 1302 కి.మీ. ఉండగా, అందులో 390 కి.మీ., మేజర్ నాలా ఉంటుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.56.38 కోట్ల అంచనా వ్యయంతో 201 పనులు 919 కిలోమీటర్ల వరద కాలువను 952.69కిలోమీటర్ల పూడికతీత లక్ష్యంతో ఇప్పటివరకు 781.42 కి.మీ మేర పూర్తయినట్లు చెప్పారు. 3.3 లక్షల క్యూ.మీ ఫ్లోటింగ్ మెటీరియల్‌ను తొలగించి, 85.73 శాతం పూర్తి చేశామన్నారు. అందులో 72.41 శాతం పూడికతీత మట్టిని జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించినట్లు తెలిపారు.